ఈహిందూ దేశములో నేనాడెడి మాటగను, పాడినది పాటగను నామాట వేదాక్షరముగను చెల్లుచున్నది మదరాసు ప్రాంతమున నిద్రపోవునపుడు- నిద్రకుపూర్వము- భోజనము తరువాత భోజనమునకు పూర్వము- స్నానసంధ్యలకుపూర్వము- దంతధావనమునకు పూర్వము- యిప్పుడప్పుడనకుండా "కొక్కొరోకో"యని తొలికోడి కూసినదిలగాయతు తిరిగి రాత్రి నిద్రపోవువరకు సర్వకాల సర్వావస్థలయందు నన్ను సేవింపక మానరు. దైవప్రార్థనమునకు "త్రోసిరాజ"ని ప్రాతఃకాలమున శంకరా! శంకరా! యని లేచుటకు బదులుగా కారకిళ్లీ! కారకిళ్లీ! యని లేచి ముందుగా నాదర్శనము చేయనిదే రెండవపనికి పోరు. నేనాంధ్రమండలమునకు వ్యాపించి సుమారు పదిపండ్రెండు వత్సరములైనను సకలాంధ్రజనారాధనను పొందుచు, చాలమందితో సఖ్యముచేయుచున్నాను. నాకు బాగాళా తమలపాకుతో సఖ్యముకుదిరినట్లు మరి దేనితోను జతకుదరకపోయినను కొన్ని కారణములవల్ల నన్నాంధ్రులు ద్రాక్షారామ, సత్యవరం తమలపాకులతో కలిసినను ఊరకుండవలసివచ్చినది. "రాకన్ మానదు హానివృద్ధులు మహారణ్యంబులో దాగినన్" అనునీతి నేనెరుంగుటవల్ల నే దేశములో నెటువంటి కష్టములు సంప్రాప్తించినను నేలాగో సరిపుచ్చుకొని హిందువులతో సఖ్యము నొసంగుచున్నాను. నాకుగల దినదిన ప్రవర్ధమానత్వము ఈదేశములో మరిదేనికిని లేదని నేను నొక్కి చెప్పగలను. ప్రతిదినమును నేను నూటికి తొంబదిమంది విద్యార్థుల జిహ్వలలోనుందును. నాటకాంత గృహోన్ముఖుల బుగ్గలందు తాండవమాడుచుందును. మిగతావారు నూటికి నలుబదిమందికి

